క్లుప్తంగా

కుష్టు వ్యాధిపై ఆందోళన వద్దు



మందులు అందజేస్తున్న జయలక్ష్మి

కూడేరు: కుష్టు వ్యాధి పట్ల భయాందోళన వద్దని, ప్రాథమిక దశలో గుర్తించి సక్రమంగా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని జిల్లా కుష్టు వ్యాధి నివారణాధికారి జయలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో వైద్యాధికారులు అంగ వైకల్య–పునరావాస వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆమె తనిఖీ చేసి, కుష్టు వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు, లేదంటే కాళ్లు, చేతుల వేళ్లకు పుండ్లు ఏర్పడి ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. పుండ్లు కాకుండా ఏవిధంగా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంఓలు నాగన్న, మరియదాస్, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం వసుంధర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మా పొలాలకు దారి చూపండయ్యా..

కళ్యాణదుర్గం: గత ఎనిమిది నెలలుగా పొలాలకు దారి లేకుండా చాలా ఇబ్బందులు పడుతున్నామని, తమ పొలాలకు దారి చూపండి అంటూ కళ్యాణదుర్గం మండలం పాపంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆర్డీఓను కలిసి విన్నవించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రైతులు తమ సమస్యను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. గరుడాపురం పొలం సర్వే నంబర్ 446–1. 446–2లలో భూములకు వెళ్లేందుకు రస్తా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. భూముల్లోకి వెళ్లకుండా గ్రామానికి చెందిన సోమశేఖర్ అనే రైతు అడ్డంగా ఇనుప కంచెను ఏర్పాటు చేశారన్నారు. అలాగే మరో రైతు సురేష్ కంపచెట్లను అడ్డంగా వేశారని తెలిపారు. ప్రస్తుతం తమ భూముల్లో పంటలను సాగు చేశామని పంట భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. తమ భూములకు రస్తా చూపాలని రైతులు బాలన్న, వెంకటేశులు, రామలక్ష్మమ్మ, కిష్టప్ప, సత్యప్ప, వెంకటరెడ్డి, దామోదర్‌చ, మల్లిలు విన్నవించారు.

రహదారి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆవులెన్న గ్రామస్తులు

బెళుగుప్ప: మండలంలోని ఆవులెన్న గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడంపై గ్రామస్తులు సోమవారం సర్పంచ్ రామ్‌మోహన్‌తో కలసి తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి బెళుగుప్ప–కళ్యాణదుర్గం మధ్య ప్రధాన రహదారి నుంచి శతాబ్దాల క్రితం నుంచీ దారి ఉందని, అయితే గ్రామానికి చెందిన కొందరు దారిని జేసీబీతో చదును చేయించి ఆక్రమించారన్నారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌తోపాటు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

బెళుగుప్ప: తాను చదివిన పాఠశాల అభివృద్ధికి కొంత మంది మిత్రులు, పూర్వ విద్యార్థుల సహకారంతో కృషి చేస్తానని గుత్తి డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అనిమల్ హెల్త్ ఇండియా, ఆర్‌జీ గుప్తా అసోషియేట్స్ వారి సహకారంతో ఆయన రూ.2.5 లక్షలతో 50 డెస్క్‌లను, మరో మూడు లక్షల వ్యయంతో పాఠశాల ముఖ ద్వారం ఏర్పాటుపనులను చేపట్టారు. ఆయా పనులను మెటీరియల్‌ను హెచ్ఎం వెంకటప్రసాద్, పాఠశాల కమిటీ చైర్మన్ రుద్రన్న, ఉపాధ్యాయ బృందం, ఎంఈఓ–2 హరికృష్ణతో కలసి ఆయన పరిశీలించారు.

వేతనం లేనప్పుడు పదవులెందుకు?

బొమ్మనహాళ్: గౌరవ వేతనం ఇవ్వనప్పుడు తమకు పదవులు ఎందుకు అంటూ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పద్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, పీఆర్ జేఈఈ జగదీష్, ఏఓ సాయికుమార్, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న, తదితరులు హాజరయ్యారు. ప్రజాసమస్యలు, అభివృద్ధి పనులపై చర్చ జరగాల్సిన చోట సభ్యులు తమ గౌరవ వేతనాల గురించి మాత్రమే ప్రస్తావించారు. ఎంపీడీఓ విజయభాస్కర్ స్పందిస్తూ ఇది రాష్ట్ర వ్యాప్త సమస్య అని తెలిపారు. జీతాలు లేనప్పుడు ఈ పదవులు ఎందుకు.. రాష్ట్రానికి ముఖ్యమంత్రి, నియోజకవర్గానికి ఒక్క ఎమ్మెల్యే ఉంటే చాలు కదా అని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక్కొక్కరిగా బయటకు వెళ్లిపోయారు.

నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేయాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



కళ్యాణదుర్గంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు

కళ్యాణదుర్గం: ప్రాణాలను బలిగొంటున్న నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐతో విచారణ చేపట్టి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య డిమాండ్ చేశారు. మద్యం ప్రియుల నుండి ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వసూలు చేసి అక్రమంగా వచ్చిన మద్యం సొమ్ముతో విగ్రహాలు పెట్టి సొంత డబ్బు అంటే ఎలా? అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును సూటిగా ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సోమవారం కల్తీ మద్యాన్ని అరికట్టాలని, బెల్టు షాపులను తొలగించాలనే డిమాండ్లతో కళ్యాణదుర్గంలోని ఎక్సైజ్ కార్యాలయం ముందు పార్టీ శ్రేణులతో కలసి సోమవారం ధర్నా నిర్వహించారు. తలారి రంగయ్య మాట్లాడుతూ సొంత డబ్బులు, సొంత నిధులు అని డబ్బా కొట్టుకుంటూ పేదల నుంచి వచ్చిన మద్యం డబ్బు టీడీపీ నేతలకు చేరుస్తారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్తున్న మద్యం ధర ఎంత? కళ్యాణదుర్గంలోని కళ్యాణి వైన్స్‌లో బాటిల్ ధర ఎంత? తేడాను ప్రజలు తెలుసుకోవాలన్నారు. కళ్యాణి వైన్స్ బోర్డుల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ ఫొటో ప్రచురించి పక్కన మద్యం బాటిళ్లతో బోర్డులు ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. నందమూరి కుటుంబానికి ఎంతో విలువ ఉండేదని, మద్యం షాపులకు యాడ్ ఇచ్చి ఎన్టీఆర్ ఆత్మ క్షోభించేలా పరువు తీస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో బెల్టు షాపులు ఉన్నాయని, వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. అధికారులను ప్రశ్నిస్తే చంద్రబాబు అడ్డుకోవద్దని ఆదేశాలిచ్చారని సమాధానం చెబుతున్నారన్నారు. చంద్రబాబు మద్యం ద్వారా సంపద సృష్టిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు బెల్టు షాపులు పెడితే తోలు తీస్తానని చెప్పిన పెద్ద మనిషి ఒక్కరి తోలునైనా తీశారా అని ఎద్దేవా చేశారు. బాటిల్‌పై అదనపు డబ్బు వసూలు చేయలేదని ఎమ్మెల్యే అమిలినేని చెప్పగలడా అని నిలదీశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎక్సైజ్ సీఐ సోమశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, జడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ళ నాగరాజు, వివిధ విభాగాల జిల్లా కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, బయ్యన్న, హనుమంతరెడ్డి, ఎంపీపీలు ఆంజినేయులు, భీమేష్, పార్టీ మండల కన్వీనర్లు సుధీర్, గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, జి. హనుమంతరాయుడు, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపారం శ్రీనివాసులు, కుర్రా రాము, పరమేశ్వరప్ప, లక్ష్మన్న, నాయకులు దొడగట్ట నారాయణ, తాలూకా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి, వికలాంగుల సంఘం తాలూకా అధ్యక్షులు పాతలింగ, నాయకులు కామక్కపల్లి మల్లి, ప్రతాప్, మురళి, రామిరెడ్డి, మంజు, శంకర్, బుళప్ప, రామాంజినేయులు, మల్లికార్జున, నటరాజ్, తేజ, పాండు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: నకిలీ మద్యం తయారీ–విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ఆందోళన రాయదుర్గంలో విజయవంతమైంది. పార్టీ పరిశీలకుడు ఎల్ఎం మోహన్ రెడ్డి, ఎస్ఈసీ మెంబర్ గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు, పట్టణ, గుమ్మఘట్ట, రాయదుర్గం, డి హీరేహాళ్ మండలాల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గౌని లక్ష్మీకాంతారెడ్డి, రామాంజినేయులు, రవీంద్రానాథ్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలసి కణేకల్లు రోడ్డు నుంచి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్ వరకు ప్లకార్డులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడినవినతి పత్రాన్నిఎక్సైజ్ ఎస్ఐ దామోదర్‌కు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మెట్టు విశ్వనాథ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో వెలుగుచూసిన భారీ నకిలీ మద్యం రాకెట్ వ్యవహారంలో వేళ్లన్నీ ప్రభుత్వ పెద్దల వైపే చూపుతున్నాయన్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. కేసును తప్పుదారి పట్టించేందుకే ‘సిట్’ దర్యాప్తును వెలుగులోకి తేవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తప్పు చేయకపోతే సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 75 వేల బెల్టు షాపుల ద్వారా గ్రామాల్లోనూ సారా–మద్యం ఏరులై పారించారని ధ్వజమెత్తారు. నకిలీ మద్యం తాగి ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్ గౌని ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రాణాలతో చెలగాట మాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం దందా వెనుక దాగిన టీడీపీ పెద్దల కుట్రలను పోలీసులు బహిర్గతం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి కుంభకోణాలేవీ లేకపోయినా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నానా హంగామా చేశారని, ఇప్పుడు ఆయన ఎందుకు మౌనం వహించాల్సి వస్తోందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ఎల్ఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన మద్యం రూ.99కే ఇస్తామని చెప్పి మందుబాబులను సీఎం చంద్రబాబు మోసం చేశారన్నారు. గ్రామాల్లో కుటీర పరిశ్రమల్లాగా నకిలీ మద్యం తయారు చేసి బెల్టుషాపుల ద్వారా అమ్మించడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం మహమ్మారిని నిర్మూలించే వరకు ఉద్యమం ఆపేది లేదని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మాట్లాడుతూ బెల్టుషాపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు శారద, నాయకులు మాధవరెడ్డి, వరికూటి హంపారెడ్డి, దొడగట్ట క్రిష్టప్ప, కేపీదొడ్డి రమేష్, మైనార్టీ నాయకుడు బషీర్, గౌని శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్ గౌని లావణ్య, వేపరాళ్ల దిలావర్‌బాషా, శ్రీనివాసులు, దివాకర్, రామాంజినేయులు, గుమ్మఘట్ట రాజు, అంజిరెడ్డి, హనుమతరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తో పాటు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సోషల్‌మీడియా కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కణేకల్లు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం దందా

కణేకల్లు: టీడీపీ నేతలకు నకిలీ మద్యం దందా ఒక కుటీర పరిశ్రమగా మారిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. నకిలీ మద్యంపై కణేకల్లులో వైఎస్సార్‌సీపీ సోమవారం పోరుబాట నిర్వహించింది. నాయకులు ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నకిలీ మద్యాన్ని అరికట్టాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన దర్గాహోన్నూరులో బెల్టుషాపులు యథేచ్ఛగా నడుపుతున్నా పట్టించుకొనేవారు లేరని బొమ్మనహాళ్ మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రామాంజినేయులు మండిపడ్డారు. అనంతరం ఎక్సైజ్ సీఐ ఉమాబాయికి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, బసప్ప, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, ఉద్దేహాళ్ సర్పంచు కోటిరెడ్డి, బొమ్మనహాళ్ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్. వన్నూరుస్వామి, చిదానంత, తిప్పేస్వామి, ప్రకాష్‌రెడ్డి, వివిధ అనుబంధ సంఘాల నాయకులు ఆర్కే బద్రీ, డి.శ్రీనివాసులు, టీఎస్ఎస్ రాఫ్, చిన్న సర్మస్, యంద్రకాయల వన్నూరప్ప, కురుబ లోకేష్‌గౌడ్, తేజ, కిశోర్, బెణికల్లు సంగప్ప, జేజేటీ ప్రభాకర్‌రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు సీఐపై చర్యలు తీసుకోవాలి



ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తు అధికార పార్టీ తొత్తుగా మారి కూడేరు పోలీస్ స్టేషన్‌ను టీడీపీ కార్యాలయంగా మార్చిన సీఐ రాజు పై చర్యలు తీసుకోని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు మేరకు ఉరవకొండ, కూడేరు, బెళుగుప్ప, వజ్రకరూర్, విడపనకల్లు మండలాల నుంచి నాయకులు సోమవారం పెద్దఎత్తున జిల్లా కేంద్రం అనంతపురానికి తరలివెళ్లారు. ఆయా మండల కేంద్రాల్లో కూడేరు సీఐని సస్పెండ్ చేయాలంటూ ర్యాలీలు చేసి అనంతరం వాహనాల్లో అనంతపురంలోని ధర్నాకు బయలుదేరారు. ఈ సందర్భంగా కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి దేవేంద్ర మాట్లాడుతూ కూడేరు సీఐ రాజు మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులకు నమ్మిన బంటుగా ఉంటూ తన పేరులో సైతం పయ్యావుల రాజుగా మార్చుకుని టీడీపీకి తొత్తుగా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. స్టేషన్‌ను టీడీపీ కార్యాలయంగా మార్చి మండలంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు, పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నాడన్నారు. మండలంలో విలువైన గ్రానెట్‌ను అక్రమంగా తరలిస్తున్నా మామూళ్లు పుచ్చుకుంటూ కళ్లు మూసుకున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బూతులు మాట్లాడుతూ టీడీపీ కండువా కప్పుకోకపోతే కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారదన్నారు. ఇలాంటి దుర్మార్గపు సీఐపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని విధుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు తరలివెళ్ళిన వారిలో ఎంపీపీలు నరసింహులు, కరణం పుష్పవతి, దేవిభాయి, బెళుగుప్ప జెడ్పీటీసీ త్రిలోక్‌నాథ్, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, బసవరాజు, ఓబన్న, ఎర్రిస్వామిరెడ్డి, ఆంజనేయులు, చాబాల జగదీష్, ఉస్మాన్, విద్యార్థి సంఘం నాయకులు మంజునాథ్‌రెడ్డి, లత్తవరంగోవిందు తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన గ్రామ సచివాలయం



గడేహోతురు గ్రామ సచివాలయంలో అధికారులు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

వజ్రకరూరు: మండలంలోని గడేహోతురు గ్రామ సచివాలయం సోమవారం వెలవెల బోయింది. సచివాలయంలో గ్రామ కార్యదర్శితోపాటు మరో తొమ్మిదిమంది దాకా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిఉంది. అయితే సోమవారం మధ్యాహ్నం గ్రామ కార్యదర్శి సుభాన్ జీతోపాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆశాదీప్తి మాత్రమే ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు కనిపించలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో వెనుతిరిగారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై గ్రామకార్యదర్శి సుభాన్‌జీని వివరణ కోరగా ఇద్దరు ఉద్యోగులు రిసెప్షన్‌కు వెళ్లగా, మరో ఇద్దరు సర్వేకు వెళ్లినట్లు తెలిపారు. ఇంకొకరు మీటింగ్ వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని ఎంపీడీఓ శివాజీరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా విచారణ చేయనున్నట్లు తెలిపారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసే కుట్ర



‘రచ్చబండ’లో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

కణేకల్లు: పేదలకు వైద్యవిద్య అందకుండా చేయాలనే దుర్బుద్ధితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. విద్యావంతులు, పేద, నిరుపేద ప్రజలు చైతన్యవంతులై మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకొనేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యర్రగుంటలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. ఈ సందర్భంగా దుద్దుకుంట, ఎస్సీ కాలనీలో నిర్వహించిన ‘రచ్చబండ’ కార్యక్రమంలో మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీ నిర్వహణకు సర్కారు వద్ద డబ్బు లేదని సాకు చూపి పీపీపీ విధానం పేరిట చంద్రబాబు అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ –పీపీపీ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నరలోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను వంచిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, సర్పంచు వన్నూరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి, జిల్లా కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, యర్రగుంట మాజీ సర్పంచ్ భీమిరెడ్డి, స్థానిక నాయకులు పాటిల్ వెంకటరెడ్డి, కెంగుట రామిరెడ్డి, పాటిల్ గోవర్ధన్‌రెడ్డి, కురుబ లింగారెడ్డి, నాగరాజు, ఈరన్న, దొరైప్ప, సత్యనాంద, కేజీ వన్నూరుస్వామి, గౌని శ్రీనివాసరెడ్డి, కె.హనుమంతప్ప, జి.ఆదినారాయణరెడ్డి, కె.రామిరెడ్డి, కె.తిప్పేస్వామి, జి.సోమశేఖర్, వైకే హనుమంత రెడ్డి, వివిధ అనుబంధ సంఘాల నాయకులు ఆర్కే బద్రీ, హళ్లి నాగరాజు, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వేమన, తాళ్లకెర వీరభద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిరసన

వజ్రకరూరు/బెళుగుప్ప: వజ్రకరూరులోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం వైద్యసిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారికి మద్దతుగా సోమవారం వజ్రకరూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగ శంకర్, సుశీల, ఎల్‌టీ లలిత, ఫార్మాసిస్టు రామచంద్రనాయక్, స్టాఫ్‌నర్స్ సుజాత, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బెళుగుప్ప పీహెచ్‌సీ వైద్యాధికారుల దీక్షలకు మద్దతుగా పీహెచ్‌సీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు.

కుందుర్పి: స్థానిక పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యుల డిమాండ్ల సాధన కోసం పక్షం రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా నిరసన తెలియజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మిన్ని స్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా దివాకర్‌రెడ్డిని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో పాటు కౌన్సిలర్ శారదాదేవి, గౌని లావణ్య, చన్నవీరస్వామి, వార్డు ఇన్‌చార్జ్‌లు గౌని శ్రీరామిరెడ్డి, దివాకర్, రామాంజనేయులు తదితరులు పూలమాల, శాలువతో సత్కరించి అభినందించారు. అలాగే మున్సిపల్ డీఈ సురేష్, మేనేజర్ కిశోర్, ఏఈ నరసింహులు, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ ఈశ్వర్, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

సంపన్నుల కోసమే ప్రైవేటీకరణ

- బాబుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రంగయ్య ధ్వజం



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రంగయ్య

కుందుర్పి/బ్రహ్మసముద్రం: అగ్రకులాల్లో ఉన్న కొందరు సంపన్నులకు రోజువారీ ఆదాయం చేకూర్చేందుకే రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైయివేటీకరణ చంద్రబాబు ప్రభుత్వం తెరలేపిందని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పేర్కొన్నారు. సోమవారం కుందుర్పి, కంబదూరుల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రజల నుంచి సంతకాలు సేకరణ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సమన్వయకర్త రంగయ్య మాట్లాడారు. పేదలకు వైద్యం, వైద్య విద్యను అందించాలనే సంకల్పంతో జగన్ హయాంలోని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కళాశాలలు కనిపిస్తే ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుకు వచ్చి తనను మరచిపోతారేమో అన్న భ్రమలో సీఎం చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు హనుమంతరాయుడు, ఎంపీపీ నాగరాజు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచులు వన్నూర్‌రెడ్డి, రామూర్తి, అతావుల్లా, ప్రభాకర్, గంగాధర, విజయ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కంబదూరులో జరిగిన కార్యక్రమంలో దొడగట్ట నారాయణ, మండల కన్వీనర్లు కదిరి దేవర పల్లి హనుమంతరాయుడు, టైన్ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాయుడు, జిల్లా బూత్ కమిటీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శులు నీలిశంకరప్ప, ఆదెప్ప, ఎంపీపీ బీమేష్, వైస్ ఎంపీపీ సోమశేఖర్, కోఆప్షన్ సభ్యుడు పయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కూడేరు: ప్రతి మహిళా సంఘ సభ్యురాలూ బ్యాంక్ ద్వారా పొందిన రుణాన్ని ఆదాయ వనరులకు వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం దేవానంద ఫిలిప్స్‌న్ సూచించారు. సోమవారం కూడేరులోని వెలుగు కార్యాలయంలో విజేత మండల సమాఖ్య 21వ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం అయన మాట్లాడుతూ రుణాన్ని సకాంలో చెల్లిస్తే వడ్డీ భారం తగ్గుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విడపనకల్లు: మండలంలోని హావళిగి గ్రామంలో సోమవారం ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉందని, దోమలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య కార్యకర్త, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలను సోమవారం రిటైర్డు డిప్యూటి సెక్రటరీ, కన్సల్‌టెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను , తరగతి గదులు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు హాజరును పరిశీలించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో సమావేశమై సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఆయనను బంజారా సంఘం నాయకుడు సుబ్రమణ్యం నాయక్ కలిసి గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

‘అన్నదాత సుఖీభవ’ పేరుతో దగా

ఉరవకొండ: అన్నదాత సుఖీభవ పథకం పేరుతో కౌలు రైతులను కూటమి ప్రభుత్వం దగా చేసిందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. సోమవారం సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు మధు, జ్ఞానమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు నూతన కౌలు చట్టం తెస్తామని, పాత చట్టాన్ని సవరిస్తామని హామీ ఇచ్చి మోసగించారన్నారు. గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని.. ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం స్పందించి కౌలు రైతుల కొత్త చట్టాన్ని అమలు చేసి అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బోగన్నగౌడ్‌కు నాయకులు వినతి పత్రం అందించారు.

పొగాకు వాడితే అనారోగ్య సమస్యలు

కూడేరు: పొగాకు వాడితే క్యాన్సర్, గుండె జబ్బులు వస్తాయని, ఊపిరితిత్తులు దెబ్బతిని తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు తెలిపారు. సోమవారం కూడేరులో ఏఎస్ఐ రామానాయుడు ఆధ్వర్యంలో వైద్య శాఖ తరపున టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ కార్యక్రమం బస్టాండ్ , పాఠశాలల వద్ద నిర్వహించారు. సీహెచ్ఓ సరోజమ్మ, సూపర్ వైజర్ యశోద, ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని సంతే కొండాపురం గ్రామ పంచాయతీలో గ్రామ కంఠం, దేవదాయశాఖ భూములను ఆక్రమించినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు బ్రహ్మసముద్రం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ వనిత మల్లికార్జున తెలిపారు. దీనిపై సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణకు గురైన 15 ఎకరాల భూమిని కాపాడాలని కోరారు.

ప్రధాన తపాలా కార్యాలయం మార్పు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో గల ప్రధాన తపాలా కార్యాలయాన్ని దాసప్ప రోడ్డు సెయింట్‌పాల్ హైస్కూల్, అజీజియా షాదీమహల్ పక్కన భవనంలోకి మార్చినట్లు తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోస్ట్‌మాస్టర్ సురేంద్రబాబు సోమవారం తెలిపారు.

సూపర్ జీఎస్టీపై బైక్ ర్యాలీ

రాయదుర్గంటౌన్: సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై కార్మికశాఖ అసిస్టెంట్ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం రాయదుర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనతో ప్రయోజనం శూన్యం

రాయదుర్గంటౌన్: విభజన హామీలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏమాత్రం తోడ్పడని ప్రధాన మోదీ పర్యటనతో రాష్ట్రానికి గానీ, ప్రజలకు గానీ ప్రయోజనం ఏమీ ఉండదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున విమర్శించారు. ఈ నెల 16న కర్నూలు జిల్లాలో ప్రధాని పర్యటనను వామక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన సోమవారం సీపీఎం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

రైలు కింద పడి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం: కదిరిదేవరపల్లి– తిరుపతి ప్యాసింజరు రైలు కింద పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం కళ్యాణదుర్గం రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. కళ్యాణదుర్గం నుంచి కదిరిదేవరపల్లికి రైలు బయలుదేరుతుండగా కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు తిప్పేస్వామి ఎక్కేందుకు ప్రయత్నించాడు. వైకల్యం కారణంగా పట్టుతప్పి కిందపడడంతో రెండు కాళ్లూ పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. కుడి చేతి వేళ్లు ఛిద్రమయ్యాయి. తిప్పేస్వామిని స్థానిక సీహెచ్‌సీకి రైల్వే సిబ్బంది తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు.